# నిజమయిన పతివ్రత

మనవాళ్ళు పతివ్రత అనేపదం చెవికి కంటగింపు అయే వరకూ అమల్లో ఉంచారు. ఇప్పటి కాలపువాళ్ళకు పతివ్రతాత్వాన్ని గురించి ఎటువంటి అభిప్రాయాలున్నవో గమనించి ఆ మీద పూర్వకాలపు పతివ్రత లెటువంటివారో ఆలోచిద్దాం. ఒక హరిదాసుగారు చెబుతుండగా విన్నాను - పతివ్రతలు మూడు రకాలట. మొదటి తరగతి పతివ్రత ప్రపంచంలో తన భర్త తప్ప మరి మగవాడు లేడని భావిస్తుందట. రొండో రకం ఆవిడ ఇతర పురుషుల్నందరినీ అన్నలుగానూ, తండ్రులుగానూ భావిస్తుందట. మూడో రకం పతివ్రత పరపురుషులమీద మనస్సు పోయినా ఆపుకొని తన భర్తతోనే కాలం వెళ్ళబుచ్చుతుందట! పతివ్రతాత్వ మంటే ఏమిటో విశదమౌతూనే ఉంది - రంకుతనం చెయ్యని మనిషి పతివ్రత.

ఇక అసలు పతివ్రతలను చూడండి: ద్రౌపది, సీతా, దమయంతీ, చంద్రమతీ మొదలైన వాళ్ళను తీసుకోండి. అందరూ తమ భర్తలను స్వయంవరం చేసుకున్నారు. అందరూ కష్టాలనుభవించారు. చాలామంది భర్తలనించి ఎడబాటు కూడా పొందారు. కష్టాలకు తట్టుకున్నారు. తమ భారం యావత్తూ భర్తల మీద పెట్టి "నువ్వే నా దైవం! ఏం చెయ్యమంటే అది చేస్తాను" అనకుండా తమ ఆలోచనా శక్తి వినియోగించారు. విపరీతమైన ధైర్యం చూపించారు. వాళ్ళను భర్తల యొక్క నీడలనటం అమర్యాద అంటాను. రావణాసురుణ్ణి అంతకాలం ఒంటరిగా ఎదిరించిన సీత రాముడి నీడ ఎట్లా అవుతుంది? ద్రౌపది తన గొప్పతనం సత్యభామకు తెలుపుకునేటప్పుడు "ఏమోనమ్మ! వాళ్ళనే దేవుళ్లుగా నమ్మి ఉన్నాను" అని ఊరుకోలేదు. ద్రౌపది చెప్పుకున్న గుణాలన్నీ పతివ్రతకు అవసరమే. ఆ అయిదుగురు భర్తల భార్యను మించిన పతివ్రత పురాణాల్లో ఎక్కడా కనిపించరు. (పతియందు వ్రతం కలది అనే ఉద్దేశ్యంతో యీ పదం వాడటంలేదు; ఆదర్శ స్త్రీకి ఇది పర్యాయపదంగా వాడుతున్నాను).

చిత్రాంగిని తీసుకుందాం. మాట వరసకు చిత్రాంగిని సారంగధరుడికిచ్చారనుకుందాం. అప్పుడు చిత్రాంగి మిగిలిన మగాళ్ళందర్నీ ఆడవాళ్ళుగా చూస్తుందను కుందాం (అనుకోటానిక్కూడా కోతిగానే ఉంది). అప్పుడు చిత్రాంగి ఉత్తమ జాతి పతివ్రత

అవుతుందా? కాదని నా వాదన. చిత్రాంగికి పతివ్రత కుండవలసిన స్థయిర్యం, స్వతంత్రంగా ఆలోచించే శక్తి రెండూ లేవు. జనక మహారాజు మొండికెత్తి సీతను - రాముణ్ని వరించిన సీతను - మరోడి కిచ్చాడనుకుందాం. అప్పుడు సీత పతివ్రత అవుతుందా? అవుతుందనే నా నమ్మకం. రాముడిమీద ప్రేమ ఆవిడ పతివ్రతాత్వాన్ని ఒకటో మెట్టు మీదినించి మూడో మెట్టుకు తోస్తుందా? ఎప్పటికీ తొయ్యదు.

❀ ❀ ❀ ❀ ❀

సీత కొత్తగా కాపరాని కొచ్చింది. ఆమెకింకా తన మామగారు చితికిపోయిన సంగతి తెలీదు. ఇరవై ఎకరాలు మాగాణీ భూమి, పదివేల రూపాయల కిమ్మతు ఇల్లూ మార్వాడీ అప్పు కింద తాకట్టులో ఉన్నట్టు తెలీదు. ముందు ఇంటి కొచ్చింది ఎసరు. సేటుగాడు రొండువేలకు ఇల్లు కొట్టేయించుకున్నాడు. సీత మామగారి సహోదరుడు తెలిసి కూడా వచ్చి ఆదుకోకుండా ఊరుకున్నాడు.

"ఏమండీ? అట్లా ఉన్నారేం?" అంది సీత మొగుణ్ణి. సీత మొగుడు నిట్టూర్చి జవాబు చెప్పలేదు. ఆ ఇంటిల్లిపాదీ ఊరందరూ ఎరిగిన విషయం సీతకు వారం పదిరోజుల్లో ఎట్లాగో తెలియబోయే విషయం - సీతకు తెలియజేయటం నామర్దాగా భావించారు. మర్నాడు సీత తోడికోడలు కుండ పగలేసి "బంగారమంటి కొంప పోతున్నదో" అని యాడవటం మొదలుపెట్టింది. అందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఆ రాత్రి మొగుడి దగ్గిర్నుంచి సీత సంగతంతా లాగింది.

తొలికోడి కూసేవరకూ సీత నిద్ర పోలేదు. మతి చెడకుండా ఆలోచించితేనే ఫలం ఉంది. గురికి బారెడు ఎడంగా అనేక ఆలోచనలు తట్టినై. అన్నీ తోసేసి తీర్మానానికొచ్చింది. వెంటనే గాఢ సుషుప్తి ఆమెను ఆవరించింది.

మర్నాడు అందర్నీ చేర్చి సీత ఆలోచన ప్రారంభించింది. వాళ్ళచేత కూడా ఆలోచింపచేద్దామని ఆమె ప్రయత్నం. కాని అందరూ మతి చెడి ఉన్నారు. అప్పుడందరితోనూ తన ఆలోచన చెప్పింది.

"నేను ఉద్యోగం చెయ్యబోతున్నాను" అంది సీత. కల్లోలం బయలుదేరింది. ఒకరు నామర్దా అన్నారు. ఆడది ఉద్యోగం చేసిపెట్టేకన్న మాడి చస్తామన్నాడు సీత బావగారు. ఉద్యోగం చెయ్యటం కన్నా చాటుగా లంజరికమే మెరుగన్నాడు మామగారు. సీత మొగుడు విసుగ్గా అందర్నీ నోరు మూసుకోమన్నాడు.

"ఎందుకు మాటలు చూసి బెదురుతారు" అంది సీత.

సీత పెట్టె తీసుకుని మేనమామ దగ్గిరికి పోయి ఉద్యోగం కావాలంది. సీతకు

టైపు రైటింగ్ చాతనవును. పదిహేను రూపాయలకు దమ్మిడీ ఎక్కువివ్వనన్నాడు. ఆయనదో రకం మనిషి. సరేనంది సీత. సీత ఉత్తరం అందగానే మొగుడు వచ్చేశాడు. అతనికి కూడా సీత మేనమామ ఆ ఇన్సూరెన్స్ కంపెనీ తరఫున కాన్వాసరుగా ఉండటానికి అనుజ్ఞ ఇచ్చాడు. ఇద్దరి సంపాదనతో కూడా గడవటం బహుకష్టమయింది. పత్రికలకు సీత వ్యాసాలు రాసి ధనార్జన చెయ్యాలని చూసింది. కాని అదీ ఎక్కువ జయప్రదం కాలేదు.

తరవాత సీత ఆ ఊళ్లో ఒక నాటకం సమాజం ఉంటే దాన్లో వేషాలు వెయ్యటానికి పూనుకుంది. కొంతకాలం అది చాలా లాభించింది. కాని సీత చనువుగా మాట్లాడటం మరో విధంగా తీసుకుని కంపెనీ ప్రొప్రయిటరుగారు కొత్త కండిషనులు మాట్లాడబోయినాడు. సీత నవ్వి "క్షమించండి! నేను చాలా పూర్వకాలపు దాన్ని!" అంది. ఆ రోజుతో ఆ ఉద్యోగం అయిపోయింది.

డబ్బు సంపాదించటానికి సీత చాలా ప్రయత్నాలు చేసింది. కాని ఎక్కడికి పోయినా మగవాళ్ళకు ఒకటే యావగా కనిపించింది. ప్రపంచంలో ఇంతమంది బాలెన్స్‌లేని మగవాళ్ళున్నారని సీత ఎరగదు.

అనుకోని అదృష్టంగా సీతకు టాకీల్లో నటించే అవకాశం, గ్రామఫోను కంపెనీవారికి రికార్డులిచ్చే అవకాశం ఒక్కసారి వచ్చినై.

"నాకు పాడటంగాని నటించటం కాని చాతవునని నాకింతవరకూ తెలీదోయ్. వాళ్ళు పిలిచేదాకా!" అన్నది సీత నవ్వుతూ నేను మొన్న ఆమెను కలుసుకుని మాట్లాడినప్పుడు. "మన వాళ్ళకు ఆలోచనాశక్తి లేదబ్బాయి. నన్నేకమంది మగవాళ్ళు వెంటాడారు. అటువంటివి ఇష్టంలేనప్పుడే అవుట్రేజయిపోయి మూర్ఛపోవటం అవివేకం. ఎవడో దార్నిపోయే కొక్కిరాయి కన్ను కొట్టటానికి మన మంచితనంతో ఏమీ సంబంధం కనిపించదు! అటువంటి వాటికి నావంటి ఆడది సంసిద్ధురాలై ఉండటమేకాక ఇంకోరి సహాయం కోరకుండా తట్టుకురావాలి!"

సీతనూ మొగుణ్ణీ అత్తవారు చాలాకాలం కిందటే వెలేశారు! సీత మామగారు గౌరవంగా బతకగలందులకు ఒకటి తరవాత ఒకటి దొంగెత్తులు వేస్తూన్నట్టు తెలుస్తుంది!

***మొదటి ముద్రణ : ప్రబుద్ధాంధ్ర, డిసెంబర్ 1934***